# హృదయ సౌందర్యం

శ్రీ గణపతి రాధాకృష్ణమూర్తి

"నిజంగా భోంచేశావా, బావా ?"

"ఊహు"

"మరి నాన్నకి ప్రొద్దున భోంచేశానని చెప్పడ మెందుకు"

"ఏమో మరి."

"చెప్పు బావా !"

"ఏకాలిది ?"

"అదికాదు బావా ! సరిగ్గా ."

"ఏదికాదు ?"

"పో బావా నీ వెప్పుడు యింతే"

"యిదుగో పోతూనే ఉన్నానుగా" పుస్తకములు సర్దుకొని కాలేజికెళ్ళాడు మోహన్.

కమల ప్రాణం చివుక్కుమన్నది. తను ఇంత ఆప్యాయంగా పలుకరించినా బావ మనసిచ్చి మాట్లాడడెందుకో అనుకుంది. తానంటే బావ కసహ్యమా ? ఎబ్బే. కాదు బావ స్వభావమే అంత. బావ చాల మంచివాడు. ఆ పచ్చటి పసిమి, నల్లటి నేత్రములు, పండిన పెదిమలు, ముద్దులు మూటకట్టే మోము, మెలితిరిగిన ముంగురులు, బూరెలులాగా ఉబికిన బుగ్గలు, అబ్బ, బావ ఎంత బాగుంటాడు. ఉదయం భోజనానికి రాకపోవటానికి కారణము నిన్న జరిగిన ఘటనేనా ? మా మామయ్య, అత్తయ్య తనకు రెండేళ్లు రాకముందే చనిపోయినా, నన్ను చూచినట్లే, ఏ కొరత కలుగకుండా తనకుకూడ మా నాన్నవాళ్ళు చూడటంలా ? ఆమాత్రము కృతజ్ఞతైన వారియందు కనబర్చకూడదు ? చిన్నప్పటినుండి మే మిద్దరం ఎంత కలసి మెలసి ఆడుకుంటుండేవాళ్ళం ! ఏదైనా బొమ్మల బొక్కు ఇయ్యి బావ అంటే తెల్లకాగితముల పుస్తక మిచ్చేవాడు గదూ ! వ్రాసుకోటానికి తెల్లకాగితముల పుస్తకమిమ్మంటే పెద్దబాలశిక్ష ఇచ్చేవాడుకదూ ! బావ చిన్నప్పటినుండి బహు కొంటె. ఎన్ని పర్యాయములు పెళ్ళిళ్ళాట ఆడుకున్నాం. ఎన్నిసార్లు నా మెడలో ఒట్టొట్టి మంగళసూత్రములు కట్టాడు. ఎన్నిసార్లు ప్రణయ కలహాలను అనుభవించాం ! అవి అన్ని ఇక మర్చిపోవలసిందేనా ? మా బావ కోసం ప్రాణమైనా ఇయ్యగలను. నరకమునుకూడ అనుభవించగలను. నేను కష్టపడుతూనైనా ఎల్లప్పుడు మా బావను సంతోష పెట్టగలను. కాని నా నలుపురంగును ఎరుపుగా మార్చలేనుగదా ? తన కాలేజీలో చదివే అందమైన యువతులను చూసి, నన్ను చూస్తుంటే బావకు అసహ్యమనిపిస్తుందేమో ! నిజమే ! కాలేజి యువతుల పౌడరు తళతళలు, స్నో సువాసనలు, నూనె నిగనిగలు, నిలకడలేని నయనములు, ముసిముసి నవ్వులకు మిసమిసలాడే బుగ్గలు, ఆ బుగ్గలలో పడే సొట్టల సొంపులు, గులాబి పెదిమల వంపులు, వారిని వెంబడించే ఘుమఘుమలు, బయటు కనబడే బాడీలు, జల్లెడలే నయమనిపించే జాకెట్లు, లోపల నుండే లంగాలు, జారీ జరీ చీరెలు మా బావ చూపులను దొంగిలించకుండా వుంటయ్యా ? నన్నుకూడ భగవంతుడు అందంగా ఎందుకు పుట్టించకూడదు" అని ఏమేమో అనుకుంటుంది కమల.

మోహానుని ముద్దుమాటలైన ,వినకముందే మాతాపితలు గతించారు. అప్పటినుంచి ఉదారుడైన మేనమామ పెంచుతున్నాడు. ఆ మేనమామ కూతురే ఈ కమల. 16 సంవత్సరాల వయస్సు. సౌష్టవంగానే వుంటుంది కాని కొద్దిగా నలుపు. పుష్పవతి ఐంది. తెలుగు బాగా చదివింది. మోహాను స్థానిక కళాశాలలో బి. ఎ. రెండవ సంవత్సరము చదువుతున్నాడు. 20 సంవత్సరముల ప్రాయము. తొలిచి, తీర్చి దిద్దిన, ముచ్చటైన విగ్రహాము. చలాకి, చతురుడు, చిలిపి, చమత్కారి. కమలను మోహానునికి ఇయ్యాలని మామైన ప్రకాశరావు పట్టుదల. మేనల్లుణ్ణి అల్లుణ్ణిగా చేసుకోవాలని అత్తైన అండాళ్ళమ్మ అభిలాష. మోహాను బావనే చేసుకుతీరాలని కమల కాంక్ష. అందాలు చిందే సుందరాంగిని పొందాలని మోహానుని వాంఛ. పెండ్లి

విషయమై ప్రకాశరావు ఎన్ని పర్యాయములు మాట్లాడినా, చేసుకోనని నిర్మొహమాటంగా చెప్తున్నాడు మోహను. ఇక చేసుకోడనే భయ మెక్కువౌతున్నకొద్దీ అత్త మామలు వాడలిపోతున్నారు. కమల కుమిలిపోతున్నది.

బి. ఏ. పరీక్షలు అన్ని ఆ నాటితో ఐపోయినై, క్లాసు వచ్చి తీరుతుందనే ఉత్సాహంతో మోహను ఇంటికి వస్తున్నాడు. దారిలోనే మామగారెదురై "ఏరా మోహన్, క్లాసువస్తుందా" అన్నాడు. "తప్పక రావాలి మామయ్యా." అన్నాడు మోహను. గడప లెక్కుతుంటే నీళ్ళకు వెళ్తున్న అండాళ్ళమ్మ ఆపి "ఏమోయి బాగా వ్రాసావా"? అంది. "ఆ బాగానే వ్రాశానత్తయ్యా" అంటూ గదిలోకెళ్ళాడు మోహను డ్రస్సు మార్చుకోడానికి. కమల ఏదో చదువు కుంటుంది.

"ఏం బావా! బాగా వ్రాశావా అంది" చిరు నవ్వుతో.

"ఏమిటి"

"పేపరు"

"ఏం పేపరు"

"పరీక్ష పేపరు"

"ఎప్పటి పరీక్ష పేపరు ?"

"ఇవ్వాళది"

"ఎవరు"

"నీవే బావా"

"ఆ."

"అదేమిటి బావా అప్పుడే సమాధానము చెప్పావు? ఇంకా ప్రశ్న లెయ్యక."

"ఇంకా వెయ్యమన్నావా ?"

"వెయ్యి బావా"

"దగ్గరకు రా"

కమల దగ్గరకొచ్చి నిల్చొంటుంది. వీపుమీద చిన్న ఛపాతీ వేస్తాడు మోహను. కమల గగుర్పాటుతోపాటు ఆనందాన్ని అనుభవించింది. "బావా! పరీక్షలుకూడా ఐపోయినైగా! కన్న తల్లి దండ్రులను మరిపించి పెంచి, పెద్దచేసిన మానాన్నవాళ్ళ కోరిక, ప్రాణాలన్నీ నీమీద పెట్టుకొన్న నా కోర్కె తీర్చవు బావా? నీకు నా జన్మాంతము దాసీలాగా శుశ్రూష చేస్తుంటాను—"

"ఛా! అదేమిటి కమలా! నిన్ను చేసుకొనే వాళ్ళే లేరా కమలా! నన్ను చేసుకొని దాసీలాగా వుండేదాని కన్నా, ఏ యువకుణ్ణి చేసుకొనో స్వర్గ సుఖములను అనుభవించవచ్చుగా! వివాహమంటే మనం చిన్నప్పుడు ఆడుకున్న బొమ్మలాటగాదు కమలా! ఇది ఆ జన్మాంతముండే ఒక అనుబంధము. అందుకనే ఇది ఏరి కోరి, ఆలోచించి చేసుకోవలసిన పవిత్రమైన కార్యము. నిజమే! నీ హృదయంలో సౌందర్యముంది. ఏం? ఇంకొకరిని వివాహము చేసుకొని మాత్రము నీ బావను ఆదరముతో అభిమానించ కూడదూ? మీరు నన్ను ఇన్నాళ్ళు ఆదరాభిమానాలతో సాకినందుకు నే నెల్లప్పుడు కృతజ్ఞుడ్నే. మీ కష్టకాలంలో నా సర్వస్వాన్ని సమర్పించి ఆదుకొంటాను. మీ అమ్మ నాన్న నీ కెంతో నాకుకూడ అంతే. క్షమించు కమలా! బావ కఠినంగా మాట్లాడేడని అనుకోకు" అంటూ రాకెట్ తీసుకొని క్లబ్బుకెళ్లాడు మోహన్.

పరీక్షా ఫలితాలు ప్రకటింపబడ్డవని కమల పేపరు చూచిందేకాని మోహను మన ప్రపంచంలో లేడు. విరిగిన కాలికి డాక్టరు కట్టు కడుతున్నాడు. రక్తము ఎగచిమ్ముతున్నది. ప్రకాశరావు, అండాళ్ళమ్మ అదుర్దా పడుతున్నారు. మా బావను బ్రతికించమని కమల కనుబడిన దేవుళ్ళందరికి మొక్కుతున్నది. మోహను స్నేహితులంతా వచ్చి చూచిపోతున్నారు. 'కారు యాక్సిడెంట్' అని పోలీసువారు దర్యాప్తు చేస్తున్నారు—ఇది జరిగిన నెల రోజులకు మోహను క్రమంగా కోలుకున్నాడు. కమలముఖ వికసించింది. అత్త మామలు ఆనందభరితు లయ్యారు. కాని మోహను ఇప్పుడు వికలాంగుడు. తన అంగ విహీనతకు మోహను కుళ్ళిపోతున్నాడు. కాని అత్తమామలు, కమల తనను ఇదివరకుకన్న వింతో ప్రేమతో చూస్తున్నారు.

## హృదయ సౌందర్యం

"బావ బి.ఏ. కు కాఫీ రెడీ" అంటూ కమల కాఫీ కప్పు మంచంమీద పడుకొన్న బావ కందిస్తుంది.

"కమలా! మీ ఋణం ఎలాగ ఎప్పటికి తీర్చుకుంటానో గదా! నిజంగా నీవు సుగుణాల కుప్పవు కమలా! నీవు కమలముకన్న కోమలమైన విదానివి కాని ఆ కమలములో కంటకములున్నై. ఈ కమలములో కుసుమరేణువులున్నై. నీ హృదయం అంతా మార్దవంతో నిండియున్నది. నీ పలుకులలో పనసతొనల మాధుర్యముంది. నీ చల్లని చూపులలో, చిగిర్చి విరజిమ్మిన విరజాజిపూల పందిరిలోని హాయి ఉంది. నీ హస్త స్పర్శ .."

"తగ్గండి బావా! నల్లపిల్లను ఇంత ఎగతాళి చేయకూడదు."

"క్షమించు కమలా! నీ హృదయ సౌందర్యమునకు ముగ్ధుడ్నై పోయినాను. ఒకవేళ బావ కుంటివాడని నీవు అనుకుంటూ .. .."

"బావా, ఈనాటికి నేను కృతార్థురాలనయ్యాను..."

★

# వసంతాగమనము

❋ సుభద్ర ❋

పండి పోయిన ఆకు
ఎండి రాలెను, మ్రాకు
మొండియై నిలిచాక
పిండివలె పొగమంచు
దండిగా కురిసిందీ
వెండిలా మెరిసిందీ॥

మంచిమామిడి తోపు
పూచె పుప్పొడితోడ;
పంచబాణుడు పొంచి
యంచ నంపించాడు
మంచు కరిగించాడూ
అంచు ఒరిగించాడూ॥

సన్న మామిడి గున్న
నున్న కోకిల కన్నె
మిన్నన్న యే తన్ను
చిన్న చూపులు చూచె
సన్న కూతలు కూసెనూ
ఉన్న మేతలు మేసెనూ॥

లేత చిగురుల మేత
చేత కోకిల కూత,
చూత పుప్పొడి ముంత
చెంత భృంగపువంత
కంతమే లేదెందుకో!
వంతగించే దెందుకో!

★